సాక్షి సిద్దిపేట

బుధవారం, 25, జనవరి, 2023



వసంత పంచమికి సిద్ధం 8లో..

రేపటి వసంత పంచమి వేడుకలకు వర్గల్ సరస్వతీ దేవి ఆలయం ముస్తాబైంది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.



కారు బోల్తా.. యువకుడి మృతి

అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలంలో చోటు చేసుకుంది. 8లో..



నిర్వాసితుల సహకారంతో ..

గౌరవెల్లి ప్రాజెక్టును భూ నిర్వాసితుల సహకారంతో పూర్తి చేసి ప్రాజెక్టులో గోదావరి జలాలను నింపుతామని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. 9లో..

న్యూస్‌రీల్

నంగునూరు ఉపసర్పంచ్ చెక్ పవర్ రద్దు



పంచాయతీ పాలకవర్గ సమావేశం

నంగునూరు(సిద్దిపేట): జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి ఆదేశాల మేరకు నంగునూరు ఉపసర్పంచ్ చంద్రకళ చెక్ పవర్ రద్దు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం నంగునూరు పంచాయతీ పాలక వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది వేతనాలు, బిల్లులకు సంబంధించి చెక్కులపై ఉప సర్పంచ్ సంతకాలు పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సర్పంచ్ మమత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిందన్నారు. విచారణ అనంతరం డీపీఓ నివేదిక పంపడంతో ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. పాలకవర్గం తీర్మానం మేరకు నాలుగో వార్డు సభ్యురాలు దేవులపల్లి శోభకు ఈ చెక్ పవర్ అప్పగించామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సునిత, కోఆప్షన్ సభ్యుడు రహీంపాషా, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, వార్డు సభ్యులు ఉమాకర్, రాజిరెడ్డి, గణేశ్, రాంజేదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7,364 మందికి కంటి పరీక్షలు

సిద్దిపేటకమాన్: జిల్లా వ్యాప్తంగా రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. 45 బృందాలు మంగళవారం 7,364 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 1,887 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కాశీనాథ్ తెలిపారు. మరో 1,319 మందికి అద్దాలు ఆర్డర్ పెట్టినట్లు తెలిపారు.

వరిని చీడపీడల నుంచి కాపాడాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నకోదూరు(సిద్దిపేట): వరి పంటలకు వస్తున్న చీడపీడల నుంచి కాపాడుకోవడానికి పలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గంగాపూర్, రామంచ గ్రామాల్లో శాస్త్రవేత్తలు రఘురాం, ఆర్.జీ వర్మ, కిరణ్‌బాబు, శ్రీదేవి, విజయ్‌కుమార్‌తో కలిసి రైతులు సాగు చేసిన వరి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. యాసంగిలో వరిలో గొట్టం పురుగు, మొగి పురుగు, కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉందన్నారు. వరి చేనులో కొనలపైన రెక్కల పురుగులు, కాండం తొలుచు పురుగు పంటను ఎదగకుండా నష్టం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జయంత్ కుమార్, ఏఈఓలు లక్ష్మి, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

రసాయన రహిత పద్ధతులు అవలంబించాలి

ఉద్యాన యూనివర్సిటీ వీసీ నీరజాప్రభాకర్

ములుగు(గజ్వేల్): చీడపీడల నివారణలో రసాయన రహిత పద్ధతులు ఆచరించాలని ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ నీరజాప్రభాకర్ సూచించారు. మంగళవారం యూనివర్సిటీలో షెడ్యూల్డ్ కులాల రైతులకు రసాయన రహిత చీడపీడల నివారణ విధానాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైర్లలో చీడపీడల నివారణకు లింగార్షక బుట్టలు, సోలార్ లైట్ ట్రాప్స్ వాడకంతో పురుగు మందుల వినియోగం తగ్గుతుందన్నారు. అలాగే ఆహార పంటల్లో రసాయన అవశేషాలు తగ్గుతాయని వివరించారు. అనంతరం రైతులకు లింగార్షక బుట్టలు, సోలార్ లైట్‌ట్రాప్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉద్యానవర్సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



లింగాకర్షకబుట్టలు అందజేస్తున్న నీరజాప్రభాకర్

పరిశ్రమలకు అడ్డా.. గజ్వేల్

హైదరాబాద్ తర్వాత భారీగా విస్తరణ

- ట్రిపుల్‌ఆర్, రైల్వేలైన్ సదుపాయాలు
- కొత్తగా రెండు ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు
- భూములను కేటాయించి పర్యవేక్షిస్తున్న టీఎస్‌ఐఐసీ
- ఉపాధి అవకాశాలకు మార్గం సుగమం



ములుగు మండలం తున్కిబొల్లారంలో కొనసాగుతున్న పరిశ్రమ స్థాపన పనులు

గజ్వేల్: సీఎం కేసీఆర్ సొంత ఇలాకా గజ్వేల్ ఇండస్ట్రియల్ హబ్‌గా అవతరించనుంది. హైదరాబాద్ తర్వాత నగరానికి సమీపంలో ఉన్న ఇక్కడే పరిశ్రమల విస్తరణకు అపారమైన అవకాశాలున్నాయని గుర్తించిన పారిశ్రామికవేత్తలు ఈ ప్రాంతంపై దృష్టి పెట్టారు. ప్రత్యేకించి ట్రిపుల్‌ఆర్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతుండటం, మనోహరాబాద్ నుంచి గజ్వేల్ మీదుగా పెద్దపల్లి గ్రాండ్ ట్రంక్ కలుపుతూ దేశంలోని ముఖ్యమైన నగరాలను కలిపే రైల్వేలైన్ అందుబాటులోకి వస్తుండటం.. వనరుల లభ్యత కూడా సులభతరంగా మారడం కలిసివస్తుంది. ఇప్పటికే నియోజకవర్గంలోని కొల్లకల్, కర్కపట్లలో రెండు ఇండస్ట్రియల్ పార్కులుండగా కొత్తగా తున్కిబొల్లారం, వర్గల్ - ములుగులో ఏర్పాటవుతున్నాయి.

- గజ్వేల్‌ను అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలబెట్టడానికి నిరంతం శ్రమిస్తున్న సీఎం కేసీఆర్ భారీగా సాధారణ, ఆహారశుద్ధి పరిశ్రమల ఏర్పాటుతో ఈ ప్రాంతాన్ని హబ్‌గా తీర్చిదిద్దడానికి సంకల్పించారు. సీఎం ఆదేశాలతో ఇప్పటికే ములుగు మండలంలోని తున్కిబొల్లారంలో 443 ఎకరాల భూసేకరణ జరిగింది. ఇందులో టీఎస్‌ఐఐసీ ద్వారా 60 పరిశ్రమలకు భూములను కేటాయించారు. రెండేళ్ల క్రితం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వీరికి 2 నుంచి 10 ఎకరాలు ఆపైనా ఎకరాకు రూ.1.20 కోట్ల చొప్పున అప్పగించారు. ఇందులో ముఖ్యంగా సీడ్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, ఫ్యాబ్రికేషన్, జనరల్ ఇంజినీరింగ్, ఏరోస్పేస్ కాంపోనెంట్ తదితర పరిశ్రమల ఏర్పాటు పనులు చురుకుగా సాగుతున్నాయి.

మరో 100 పరిశ్రమలు

- వర్గల్ - ములుగు గ్రామాల మధ్యన మరో 1,140 ఎకరాల భూమిని టీఎస్‌ఐఐసీ అధ్వర్యంలో భూమిని సేకరించిన విషయం విధితమే. ఇందులో ఇప్పటికే 25 యూనిట్లకు భూములను కేటాయించారు. ఇందులో అమూల్ ప్లాంట్ 50ఎకరాలు కేటాయించగా...పనుల ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇక్కడ పూర్తిగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు మాత్రమే భూములు ఇవ్వడానికి నిర్ణయించారు. ఈ క్రమంలోనే గతేడాది దరఖాస్తు చేసుకున్న వీరికి ఎకరాకు రూ.75 లక్షల చొప్పున 2 నుంచి 50 ఎకరాల వరకు కేటాయిస్తున్నారు. మరో 100 కు పైగా ఇక్కడ పరిశ్రమలు రానున్నాయి. దీనిని నిరుద్యోగ యువత ఉపాధికి మార్గం సుగమం కానుంది. ఇప్పటికే నియోజవర్గంలోని ములుగు మండలం దామరకుంట, కర్కపట్ల, తూప్రాన్ మండలం కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి, కూచారం తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటైన సంగతి తెలిసిందే.

దేశంలోని ప్రధాన ప్రాంతాలకు..

- కొత్త పరిశ్రమల స్థాపనకు హైద్రాబాద్ తర్వాత గజ్వేల్ ప్రాంతమే ప్రత్యామ్నాయంగా మారుతోంది. మనోహరాబాద్ నుంచి గజ్వేల్ మీదుగా నిర్మాణమవుతున్న రైల్వేలైన్ పెద్దపల్లి గ్రాండ్ కలుస్తుండటం, గజ్వేల్ రైల్వేస్టేషన్‌ను హైదరాబాద్‌లోని స్టేషన్లకు ప్రత్యామ్నాయంగా మార్చి హబ్‌గా తీర్చిదిద్దడం వల్ల ఇక్కడే నుంచి దేశంలోని కలకత్తా, ముంబై, ఢిల్లీ, బెంగుళూరు, చెన్నైతోపాటు షిర్డీ, తిరుపతి తదితర ప్రాంతాలకు అనుసంధామయ్యే అవకాశం ఉంది. దీనివల్ల సరుకు రవాణా సులభతరం కానుంది.

> **పరిశ్రమల స్థాపన వేగిరం**
>
> గజ్వేల్ నియోజకవర్గంలో సాధారణ, ఆహారశుద్ధి పరిశ్రమల స్థాపనకు వేగంగా సాగుతోంది. తున్కిబొల్లారం, వర్గల్ - ములుగులో పరిశ్రమల స్థాపన భూములు కేటాయింపు జరిగింది. కొందరు పనులు కూడా ప్రారంభించారు. రానున్న రోజుల్లో మరిన్ని పెద్ద పరిశ్రమలు ఇక్కడికి రానున్నాయి. వీటి ప్రారంభంతో ఉపాధి అవకాశాలు భారీగా పెరగనున్నాయి.
>
> –మాధవి, టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్

ప్రథమ స్థానంలో నిలవాలి

ఇంటర్ ఫలితాలపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో బీసీ, ఎస్సీ, ట్రైబల్ వెల్ఫేర్, మోడల్ స్కూల్, కేజీబీవీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్‌తో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్ ఫలితాల్లో గతేడాది 68 శాతం ఫలితాలతో జిల్లా ఆరో స్థానంలో నిలిచిందన్నారు. అదే సంకల్పంతో అధికారులు పని చేసి ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గురుకులాల ఆర్సీఓలు తమ పరిధిలోని కళాశాలను ప్రతీ రోజు పర్యవేక్షించాలన్నారు. గతేడాది మోడల్ స్కూల్ ఇర్కోడ్ ఫలితాలు తక్కువ గా ఉన్నందున డీఈఓ పర్యవేక్షణ చేసి రిజల్ట్ పెంచాలన్నారు. చేర్యాల జూనియర్ కళాశాల రిజల్ట్ తక్కువగా ఉన్నందున డీఐఓ ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు వెనకబడిన విద్యార్థి పేర్లను, దత్తత తీసుకున్న లెక్చరర్ పేర్లతో కూడిన ఫైల్ తనకు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్యప్రకాశ్, జిల్లా ఎడ్యుకేషన్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్సీఓలు, ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పటిష్ట చట్టాలు



ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

సిద్దిపేటకమాన్: బాలికలు, మహిళల రక్షణకు పటిష్టమైన చట్టాలు ఉన్నాయని, వీటిపై అవగాహన తప్పనిసరి అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి తెలిపారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట పట్టణంలో ఈ మేరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మంగళవారం సిద్దిపేట కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తి డాక్టర్ రఘురాం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులతో కలిసి ర్యాలీ కోర్టు నుంచి విక్టరీ చౌరస్తా వరకు, అక్కడినుండి తిరిగి కోర్టు వద్దకు నిర్వహించారు. న్యాయమూర్తులు మాట్లాడుతూ.. బాలికలు, మహిళలను ఎలాంటి ఇబ్బందులకు గురి చేసినా వారిని శిక్షించేందుకు పటిష్టమైన చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. ప్రజలకు న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, సెక్రటరీ మంతూరి సత్యనారాయణ, న్యాయవాదులు, భరోసా సెంటర్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రసవత్తరంగా ఫుట్‌బాల్ పోటీలు

గజ్వేల్, స్పోర్ట్స్‌స్కూల్, నిజామాబాద్ జట్ల జయకేతనం



పోటీల్లో క్రీడాకారులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వేదికగా తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ నిర్వహిస్తున్న అండర్-17 బాలికల చాంపియన్‌షిప్ పోటీలు మూడోరోజు మంగళవారం రసవత్తరంగా సాగాయి. ఉదయం జరిగిన తొలిమ్యాచ్‌లో గజ్వేల్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు 9-0 గోల్స్ తేడాతో ట్విన్ సిటీస్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టును ఓడించింది. గజ్వేల్ తరఫున శైలజ 3, సిరి 2, బీ.నందిని 2, వైశాలి 1, కే. నందిని ఒకటి చొప్పున గోల్స్ చేశారు. రెండోమ్యాచ్‌లో నిజామాబాద్ కేర్ ఫుట్‌బాల్ జట్టు 7-1 తేడాతో దక్కన్ డైనమోస్‌పై గెలిచింది. చైతన్యశ్రీ 3, చైత్ర 2, సుశాంతిక 2 గోల్స్ చేయగా, ప్రత్యర్థి జట్టు క్రీడాకారిణి సింధు ఒక గోల్ చేసింది. మూడో మ్యాచ్‌లో స్పోర్ట్స్ స్కూల్ జట్టు 18-0 గోల్స్ తేడాతో సిద్దిపేట ఫుట్‌బాల్ క్లబ్ జట్టుపై భారీ విజయం సాధించారు. ఈ పోటీలో నగ్మ, రాజేశ్వరి, నందిని గోల్స్ సాధనలో కీలక భూమిక పోషించారు.

బాల్య వివాహాలను అడ్డుకోవాలి

నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి రంజిత్‌రెడ్డి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సిద్దిపేటఎడ్యుకేషన్: బాల్యవివాహాలను నిర్మూలించుటకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి మూల రంజిత్‌రెడ్డి కోరారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ యువకేంద్రం, బాలల హక్కుల ప్రజావేదికల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సెట్విన్ కార్యాయలంలో బాలికలను కాపాడాలనే వాల్ పోస్టర్‌ను అవిష్కరించారు. అనంతరం సెట్విన్ జిల్లా మేనేజర్ అమీనాభానుతో కలిసి ఆయన మాట్లాడారు. సుకన్య యోజన, భేటీబచావో, భేటీ పడావో తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని ముఖ్యంగా బాలికలు పట్టుదలతో చదివి భారతదేశ మణిరత్నాలుగా ఎదగాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ బాలికలకు, మహిళలకు రక్షణగా రాష్ట్రంలో షీ టీంలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ లింగవిక్షత, బాలకార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల నిర్మూలనతో పాటు, బాలల హక్కుల కోసం తమ సంఘం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నెహ్రూయువకేంద్ర కార్యక్రమ అధికారి కిరణ్‌కుమార్, సెట్విన్ సిబ్బంది శ్రీనివాస్, ఆఫ్రోజ, ఆస్మాతరుణం, వేదిక జిల్లా నాయకులు లక్ష్మణ్, నరసింహులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ప్రారంభం

తొలిరోజు 297 మంది హాజరు



విద్యార్థుల పత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

సిద్దిపేటఅర్బన్: మండల పరిధిలోని పొన్నాల శివారులోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం జేఈఈ మెయిన్స్-23 పరీక్షలు ప్రారంభమయ్యాయి. 24వ తేదీ నుంచి ఫిబ్రవరి 1 వరకు వారం రోజుల పాటు పరీక్షలు రెండు సెషన్లుగా ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయి. తొలి రోజు మంగళవారం తొలి సెషన్‌కు 100 మందికి గాను 98 మంది, రెండో సెషన్‌కు 100 మందికి గాను 99 మంది హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ విజయ్‌కుమార్, టీసీఎస్ హెడ్ మనోజ్, టీసీఎస్ ఆఫీసర్ మహేష్‌బాబు, పీఆర్వో రఘు పర్యవేక్షించారు.

ఆడపిల్లల కన్నీటితో ప్రాజెక్టును నింపుతారా?

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి



నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆంక్షారెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆడపిల్లల కన్నీటితో గౌరవెల్లి ప్రాజెక్టులో నీరు నింపుతారా? అని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని గౌరవెల్లి ప్రాజెక్టు సమీపంలో పెళ్లయిన నిర్వాసిత ఆడపిల్లలు చేస్తున్న నిరసన దీక్షకు ఆమె మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాండ్రాల దామోదర్‌తో కలిసి సంఘీభావం తెలిపారు. ఆమె మాట్లాడుతూ రెండు నెలలుగా వాళ్లు దీక్ష చేస్తున్నా.. స్థానిక ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పట్టించుకోకపోవడం చాలా దారుణమనిన్నారు. తెలంగాణ ధనిక రాష్ట్రమంటూ ప్రగల్భాలు పలికే కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు ఈ ఆడపిల్లలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. వారి భూములు గుంజుకొని వారిని దిక్కులేని వారిని చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. నిర్వాసితులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని వారికి పరిహారం చెల్లించే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్య,టి రజిత, రమాదేవి, కమల, కౌన్సిలర్లు, సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మకు కోటొక్క మొక్కులు



ఆలయం వద్ద కిక్కిరిసిన భక్తజనం



జగదేవ్‌పూర్(గజ్వేల్): డప్పు చప్పుళ్లు.. శివసత్తుల పూనకాలు.. నెత్తిన బోనాలు.. పోతరాజు విన్యాసాలతో కొండపోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. కోటీ మొక్కులు..చిన్న పెద్దల ధూంధాంతో కొండపోచమ్మ ఆలయం వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయింది. మండలంలోని కొండపోచమ్మ ఆలయంలో సుమారు 60 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆలయం చుట్టూ భక్తులు వేసుకున్న గుడారాలతో నిండిపోయాయి. నిలిశాయి. తిగుల్‌నర్సాపూర్ గ్రామ సమీపం వరకు పొలాల్లోనే భక్తులు వంటలు చేసుకోవడం కనిపించింది. హైదరాబాద్ యాదవ సంఘం అధ్యక్షులు సాయిమాదవ్ ఆధ్వర్యంలో ధూంధాం నిర్వహించారు. హైదరాబాద్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే చాట్లపల్లి గ్రామానికి చెందిన దాసరి అశోక్ ఆధ్వర్యంలో అమ్మవారి తొట్టెల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ కృష్ణమూర్తి బందోబస్తును ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా..

- సభ్యత్వ నమోదుకు ప్రత్యేక డ్రైవ్
- ఫిబ్రవరిలో డిజిటల్ గుర్తింపు కార్డులు
- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు




సమీక్షలో మంత్రి హరీశ్‌రావు, పక్కన కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, తదితరులు

సిద్దిపేటజోన్: మత్స్యకారుల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్, ఎమ్మెల్సీ బండ ప్రకాశ్, రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, అదనపు కలెక్టర్లు ముజామ్మిల్‌ఖాన్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులతో మత్స్యకారుల సంఘాల సభ్యత్వం, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫిబ్రవరిలో రాష్ట్ర వ్యాప్తంగా 3.60 లక్షల మంది సభ్యులకు సీఎం కేసీఆర్ ఫొటోతో ఉన్న గుర్తింపు కార్డులను జారీ చేయనున్నట్లు తెలిపారు. మత్స్యకార సంఘాల్లో సభ్యులకు సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. చేపలు పట్టడం, వలలు విసరడం, ఈత కొట్టడం తదితర రంగాల్లో అవసరమైతే ముందస్తుగా శిక్షణ ఇవ్వాలన్నారు.

దాదాపు 14 వేల మంది..

జిల్లాలో దాదాపు 14 వేల మంది నూతనంగా సభ్యత్వం పొందేందుకు అర్హత కలిగి ఉన్నారన్నారు. అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నూతనంగా సభ్యత్వ నమోదు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకార సంఘాల్లో ఇప్పటికే నమోదైన 3.60 లక్షల మందితో పాటు నూతనం సభ్యత్వం తీసుకునే వారందరికీ సామూహికంగా హైదరాబాద్‌లో మత్స్యకార డిజిటల్ గుర్తింపు కార్డులను అందించేందుకు మత్స్యశాఖ చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను అందించుటకు మత్స్యశాఖ వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంతో సస్యశ్యామలం



చిన్నకోదూరు(సిద్దిపేట): కాళేశ్వరంతోనే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారిందని, చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌లు నిండు కుండలా తలపిస్తున్నాయని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణం నుంచి చిన్నకోదూరు వరకు నాలుగు లైన్‌ల రహదారిగా విస్తరణ పనులకు మెట్టుబండలు వద్ద శంకుస్థాన చేశారు. అనంతరం రంగనాయక సాగర్ నుంచి ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ రానున్న రోజుల్లో రంగనాయక సాగర్ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు నాగిరెడ్డి, ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొండం వనిత పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన పుల్లూరు బండ జాతర



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దిపేటరూరల్: ఐదు రోజులుగా పుల్లూరు స్వయంభూ లక్ష్మినరసింహా స్వామి బండ క్షేత్రంలో జరుగుతున్న జాతర ఉత్సవాలు మంగళవారం చక్ర స్నానంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా స్వామివారికి సుదర్శన నారసింహ హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్, అర్చకులు కలకుంట్ల రంగాచార్య, సర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, కమిటీ డైరెక్టర్లు తెలిపారు. సుదర్శన నారసింహ హోమంలో అర్చకులు కలకుంట్ల కృష్ణమాచారి, నవీన్ కుమార్, కలకుంట్ల వీణా చారి, చిలకమర్రి నరసింహా చారి, రమణా చారి, శ్రీవాస్తవ ఆధ్వర్యంలో పాల్గొన్నారు. పూర్ణాహుతి అనంతరం హోమ జలాన్ని గుండం జలాల్లో సుదర్శన చక్ర పెరుమాళ్ ఉత్సవమూర్తికి చక్ర స్నానం చేయించారు. వేద మంత్రాల మధ్య అర్చకులు కార్యక్రమాన్ని ఘనంగా పూర్తిచేసి ఉత్సవ మూర్తిని తిరిగి ఆలయంలోకి తీసుకువెళ్లారు.

యాజమాన్య పద్ధతులతో పంటకు రక్షణ

జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

సిద్దిపేటరూరల్: యాసంగి వరి సాగులో కాండం తొలిచే పురుగు నివారణకు రైతులు సస్య రక్షణ చర్యలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. మంగళవారం నారాయణరావుపేట మండల కేంద్రంలోని రైతువేదికలో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు పలు రకాల తెగుళ్లపై రైతులకు వివరించారు. కాండ తొలుచు పురుగు నివారణకు సోలార్ దీపపు ఎర లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలని అన్నారు. పొలంలో గుళికల మందులు వాడితే ఖర్చు పెరుగుతుందని, నాటేసే వారం ముందు ఎకరాకు 800 గ్రాముల కార్బోఫ్యురాన్ 3జీ గుళికలు లేదా 600 గ్రాముల ఫిప్రోనిల్ 0.3జీ గుళికలు వేసుకోవాలి. లార్వా దశలో తెగులు నివారణకు కార్టఫ్ హైడ్రోక్లోరైడ్ 50–ఎస్పీ రెండు గ్రాములు లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. కార్యక్రమంలో పీజేటీఎస్‌యూ శాస్త్రవేత్తలు రఘురాం, ఎస్ఆర్‌జీ వర్మ, కిరణ్ బాబు, తోర్నాల ప్రధాన శాస్త్రవేత్త శ్రీదేవి, ఏరువాక శాస్త్రవేత్త విజయ్ కుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు పద్మ, మండల వ్యవసాయ అధికారి రమణి, ఏఈఓలు నాగార్జున, సంధ్య, వరుణ్, రైతులు పాల్గొన్నారు

వసంత పంచమికి సిద్ధం

- ముస్తాబైన వర్గల్ సరస్వతీ క్షేత్రం
- ఈ నెల 26న పూజలు, అక్షరాభ్యాసాలు
- ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ



శంభునికొండపై కాంతులీనుతున్న వర్గల్ సరస్వతీ క్షేత్రం



వర్గల్(గజ్వేల్): వేద పారాయణ నిలయంగా, చిన్నారులకు జ్ఞానం ప్రసాదించే అక్షరాభ్యాస కేంద్రంగా విరాజిల్లుతోంది సిద్దిపేట జిల్లా వర్గల్ సరస్వతీ దేవి ఆలయం. వసంత పంచమి సందర్భంగా ఈ నెల 26 గురువారం వేడుకలకు సిద్ధమైంది. ఇప్పటికే ఆలయ అధికారులు రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తుల కోసం క్యూ లైన్ బారీకేడ్లు, మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఏర్పాటు చేశారు.

ఆలయాల సంగమం

- 1989 వసంత పంచమి రోజున యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి ఆధ్వర్యంలో ఆలయం నిర్మాణం చేపట్టి 1992లో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేశారు.
- ఆలయ పరిసరాల్లో శనేశ్వరాలయం, లక్ష్మీగణపతి ఆలయం, స్వయంభూ శంభులింగేశ్వరాలయం, కల్యాణ వేంకటేశ్వరాలయం, సుబ్రహ్మణ్యేశ్వరాలయం కొలువుదీరాయి.
- రూ.4 కోట్లతో కంచి కామకోటి శంకరమఠం, వేద పాఠశాల భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
- 2001లో ప్రారంభమైన సత్రం ద్వారా ఏటా 10లక్షల మంది భక్తులకు అన్నదానం చేస్తున్నారు.
- ఏటా వసంత పంచమి రోజున పెద్ద ఎత్తున చిన్నారుల అక్షరాభ్యాసాలు జరుగుతాయి.
- ప్రత్యేకంగా రూ.4 కోట్ల పైచిలుకు వ్యయంతో మూడు అంతస్తుల అక్షరాభ్యాస మహామండపం సైతం నిర్మించారు.
- కొండపైన మెట్ల మార్గంలో సరస్వతిదేవి విగ్రహం ఫొటో స్పాట్‌గా, కొండ దిగువన పార్కు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

కార్యక్రమ వివరాలు

- వసంత పంచమి రోజున ఉదయం 4 గంటలకు గణపతి పూజ, పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకరభారతి స్వామి ఆధ్వర్యంలో విశేష పంచామృతాభిషేకం, అలంకార సేవ, 7 గంటలకు పల్లకీ సేవ, గిరిప్రదక్షిణ, చండీహోమం 8.30 గంటలకు భక్తజన సామూహిక లక్ష పుష్పార్చన, అష్టోత్తర శత సరస్వతీ సూక్త పారాయణం, 11.30 గంటలకు 56 రకాల పదార్థాలతో ఛప్పన్ భోగ్, శ్రీవిద్యాజ్యోతి దర్శనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు రంగంపేట పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి చేతుల మీదుగా విద్యార్థులకు జయపట్టాల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 7 గంటలకు శ్రీమాధవానంద సరస్వతి స్వామి సమక్షంలో ప్రదోష కాల శ్రీచక్ర పూజ చేస్తారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

రవాణా సౌకర్యం

- హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలో ఉండే వర్గల్ క్షేత్రానికి వెళ్లేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది.
- సికింద్రాబాద్ గురుద్వార్ నుంచి ప్రతీ 20 నిమిషాలకో బస్ ఉంది.
- గజ్వేల్, సిద్దిపేట, కరీంనగర్ రూట్‌లో వర్గల్ క్రాస్‌రోడ్డు నుంచి ఆటోలో క్షేత్రానికి చేరుకోవచ్చు.

అన్ని ఏర్పాట్లు చేశాం

వసంత పంచమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు క్షేత్రంలో అన్ని ఏర్పాట్లు చేశాం. చిన్నారుల అక్షర స్వీకార పూజలకు, భక్తుల కోసం క్యూలైన్ బారి కేడ్లు సిద్ధమయ్యాయి. వేడుకలకు ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు హాజరవుతారు.

– యాయవరం చంద్రశేఖరశర్మ, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు

కాపలదారుడే అడవిని నరికాడు



ఆఫీసర్‌కు దుంగలను చూపుతున్న గ్రామస్తులు

చిన్నశంకరంపేట(మెదక్): అడవిని రక్షించాల్సిన కాపలదారుడు యథేచ్ఛగా అడవిని నరికేసిన ఘటన చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. టీ.మాందాపూర్ బీట్ పరిధి గజగట్లపల్లి గ్రామంలో అటవీశాఖ అధికారుల పర్యవేక్షణలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న గోపాల్ నీలగిరి చెట్లతో పాటు మరిన్ని రకాల చెట్లను నరికి కలపను తన పొలం వద్ద పొదల్లో దాచాడు. గమనించిన గ్రామస్తులు, సర్పంచ్‌తో కలిసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న బీట్ ఆఫీసర్ నవీన్ పొలంలో దాచిన 124 దుంగలను గుర్తించారు. వాచ్‌మెన్ గోపాల్‌పై కేసునమోదు చేయనున్నట్లు అటవీ అధికారులు తెలిపారు.

లెక్చరర్ అసభ్యకర ప్రవర్తన

కొండపాక(గజ్వేల్): విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు అసభ్యకరంగా మాట్లాడుతుండడంతో విసిగిన విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చోటు చేసుకుంది. కళాశాలకు చెందిన ఓ లెక్చరర్ ఇంటర్ సెకండియర్ విద్యార్థినులతో కొంత కాలంగా అసభ్యకరంగా మాట్లాడడం, వేధింపులకు గురిచేస్తున్నాడు. ఉపాధ్యాయుడి తీరుతో విసిగిన విద్యార్థులు విషయాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ ఇందిరాదేవి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ప్రిన్సిపాల్ లెక్చరర్ వివరణ కోరినట్లు తెలిసింది. ఘటన మరోమారు పునరావృత్తం కాకుండా చూసుకుంటామని ఆమె తెలిపారు.

ఇంటింటికి భగీరథ నీరు

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



నీటి క్యాన్లను అందిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకరూరల్: మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నీళ్లు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని న్నారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. భూంపల్లి మండలంని రామేశ్వరంపల్లి గ్రామంలో సొంత నిధులతో గ్రామంలోని 200 మందికి వాటర్ క్యాన్లను మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకుల సమయంలో తాగేందుకు కూడా నీటికీ తంటాలు పడ్డామని, ప్రస్తుతం సీఎం కేసీఆర్ ముందు చూపుతో సాగు, తాగు నీటికి ఢోకా లేదని అన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులన్ని నిండుకుండాలా మారాయని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ సుగుణ, ఉప సర్పంచ్ రవి, పీఏసీఎస్ చైర్మన్ కైలాష్, వైస్ ఎంపీపీ అస్క రవి, మండల అధ్యక్షుడు జీడిపల్లి రవి, కిషన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, కృష్ణ, కిషన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని పోతారెడ్డిపేటలో ఎల్లమ్మ సిద్ధియోగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జ్యోతికృష్ణ, సంఘం అధ్యక్షుడు బాలాగౌడ్, దయాకర్‌రెడ్డి, అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలవాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ విద్యార్థులకు మంత్రి హరీశ్‌రావు అందించిన డిజిటల్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. మన ఊరు–మన బడితో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని అన్నారు. సమయాన్ని వృథా చేయకుండా విద్యపై దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకొని ఉత్తీర్ణత శాతం పెంచాలని ఉపాధ్యాయులను కోరారు. హుస్నాబాద్ ప్రభుత్వ పాఠశాల వజ్రోత్సవాలను త్వరలో ఘనంగా నిర్వహించుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, కొక్కుల కీర్తి, ఎంఈఓలు దేశిరెడ్డి, పావని, హెచ్ఎం మనీల పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించారు. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి వివరాల ప్రకారం.. ఆది, సోమవారాల్లో పట్టణంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ లో 42 మంది పట్టుబడ్డారు. వీరిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా విచారణ అనంతరం జడ్జి 40 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా, ఇద్దరికి రూ.3 వేల జరిమానా విధించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి బలవన్మరణం

తూప్రాన్: కుటుంబ తగాదాలు, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తూప్రాన్ పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సురేశ్‌కుమార్ వివరాల ప్రకారం.. మండలంలోని వట్టూరు గ్రామానికి చెందిన పాంబండ లక్ష్మణ్(36) తూప్రాన్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి కుటుంబంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో భార్య వరలక్ష్మి పిల్లలను తీసుకొని తూప్రాన్‌లోనే నివాసం ఉన్న కనకలక్ష్మి ఇంట్లో నిద్రించింది. మంగళవారం ఉదయం ఇంటికి వెళ్లి చూసే సరికి లక్ష్మణ్ ఉరేసుకొని మృతి చెంది కనబడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

కడుపునొప్పితో వ్యక్తి ఆత్మహత్య

మెదక్ రూరల్: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన హవేళిఘణాపూర్ మండలం శమ్నాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పోతరాజు నాగరాజు(28) కడుపునొప్పి భరించలేక గ్రామశివారులోని ఓ రైతు రేకుల షెడ్డులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

విధుల నుంచి తొలగింపు

సిద్దిపేటరూరల్: విద్యార్థులను కర్రతో చితకబాదిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పుల్లూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన 5తరగతి విద్యార్థులు టాయిలెట్ కోసం బయటకు వెళ్లి ఆలస్యంగా రావడంతో ఉపాధ్యాయుడు శ్రీనివాస్ వారిని కర్రతో బాదిన విషయం తెలిసిందే. ఈ విషయంపై సర్పంచ్ నరేశ్, విద్యార్థుల తల్లితండ్రులు డీఈఓకు ఫిర్యాదు చేయగా, విచారణ అనంతరం విద్యాహక్కు చట్టంప్రకారం, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసినట్లు డీఈఓ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి పట్టణానికి చెందిన ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి వివరాల ప్రకారం విద్యుత్ శాఖ కార్యాలయం వెనుక సాయినగర్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దువ్వ గిరిబాబు సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి నల్లగొండ వెళ్లాడు. తిరిగి మరుసటి రోజు వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో బంగారం, నగదు కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తల ఎత్తుకునేలా చదవాలి

ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకమాన్: తెలంగాణ వచ్చాక పోలీస్ ఉద్యోగాల కోసం మూడు నోటిఫికేషన్లు ఇచ్చామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. పోలీసు నియామకాల పరీక్షల నిమిత్తం ఫిజికల్ ఈవెంట్స్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులకు మెయిన్స్ పరీక్ష ఉచిత శిక్షణ శిబిరాన్ని సిద్దిపేట పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో సీపీ శ్వేతతో కలిసి మంగళవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. పోలీసు తుది పరీక్షలకు ఎంపికైన 450 మందికి ఉచిత శిక్షణ, భోజనం, స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. ఈ సందర్భంగా శిక్షణ అందించిన పీఈటీ టీచర్లను, పోలీస్ అధికారులు సన్మానించి అప్రిసేషన్ సర్టిఫికెట్ అందజేశారు. సీపీ శ్వేత మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శిక్షణ తరగతులకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ ఎస్ మహేందర్, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, సిద్దిపేట ఏసీపీ దేవారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమంగా రాణించాలి

- ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి
- విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గజ్వేల్‌రూరల్: పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లోని సమావేశ హాల్‌లో మంగళవారం పలు ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు డిజిటల్ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన అందిస్తోంది అన్నారు. విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకొని ఉత్తమంగా రాణించాలని అన్నారు. గజ్వేల్, వర్గల్, మర్కూక్, జగదేవ్‌పూర్, కొండపాక, ములుగు మండలాలకు చెందిన 4వేల మంది విద్యార్థులకు డిజిటల్ స్టడీ మెటీరియల్‌ను అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఎంపీపీ దాసరి అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, ఎంఈఓ సునీత, మున్సిపల్ వైస్‌చైర్మన్ జకీయొద్దీన్, కౌన్సిలర్ గోపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో రికవరీ శాతం పెంచాలి

రాజన్న సిరిసిల్ల జోన్ డీఐజీ రమేశ్‌నాయుడు



వివరాలను తెలుసుకుంటున్న రమేశ్‌నాయుడు

సిద్దిపేటకమాన్: దొంగతనాల కేసులను త్వరాగా ఛేదించి ప్రాపర్టీ రికవరీ శాతం పెంచాలని రాజన్న సిరిసిల్ల జోన్ డీఐజీ రమేశ్‌నాయుడు అన్నారు. మంగళవారం సిద్దిపేట పోలీసు కమిషనర్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన కార్యాలయంలోని విభాగాలను పరిశీలించి, పోలీసుల పనితీరును అభినందించారు. కమిషనరేట్ పరిధిలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్‌లు, జిల్లాలోని సర్కిల్స్, పోలీస్ స్టేషన్‌లు, భౌగోళిక పరిధిపై గురించి సీపీ శ్వేత ఆయనకు వివరించారు. జిల్లాలో నమోదవుతున్న కేసులు, విచారణ తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని, బందోబస్తు సమయంలో పోలీసు అధికారులకు, సిబ్బందికి బ్రీఫింగ్ ఇవ్వాలని సూచించారు. కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని, కేసుల్లో శిక్షల శాతం పెంచాలని తెలిపారు. గ్రేవ్ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల్లో పరిశోధన త్వరగా పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ వేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు సుభాశ్ చంద్రబోస్, గజ్వేల్ ఏసీపీ రమేశ్, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతి రెడ్డి, ఆర్ఐలు శ్రీధర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

శిశువు మిస్సింగ్‌పై ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం పోచారంలో గత వారం జన్మించిన ఆడ శిశువు మిస్సింగ్‌పై ఐసీడీఎస్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గణపతిగూడెంకు చెందిన గర్భిణి సునీత(25) ఈ నెల 19న డెలివరీ అయింది. ఆడశిశువుకు జన్మనిచ్చిన సునీతను ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న అంగన్‌వాడీ టీచర్ ఈ నెల 20న గణపతి గూడెంకు వెళ్లి సునీత తల్లి వద్ద ఉన్న శిశువును చూసి, వివరాలు నమోదు చేసుకుంది. కాగా ఈనె 24న ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్ సల్మా పాపను చూసేందుకు ఇంటికి వెళ్లగా పాప అక్కడ లేదని, బుదేరాలో మృతురాలి అత్త లక్ష్మి, మేనమామ నర్సింహులు తీసుకెళ్లారని తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాపను సంగారెడ్డి సీడబ్ల్యూసీ ఎదుట హాజరు పర్చాలని కోరారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



ఎల్లయ్య మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): చెరువులో స్నానం చేసేందుకు వెళ్లిన వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన ఘటన కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేటలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి వివరాల ప్రకారం .. వెంకట్రావ్‌పేటగేట్‌కు చెందిన వడ్డె పల్లపు ఎల్లయ్య(30) సమీపంలోని గూడెం చెరువులో స్నానం చేసేందుకు అన్న ఆంజనేయులు, మరో వ్యక్తితో కలిసి వెళ్లాడు. మెట్లవద్ద స్నానం చేస్తుండగా జారి నీటిలో పడి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..



గుర్తుతెలియని మృతదేహం

ఝరాసంగం(జహీరాబాద్): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఝరాసంగం పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో సోమవారం ఓ మెడికల్ షాప్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి స్పృహ కోల్పోయి పడి ఉన్నాడు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఫిర్యాదుతో పోలీసులు అతడిని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి వయస్సు 60 ఏళ్లు ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 87126 56771లో సంప్రదించాలన్నారు.

కారు బోల్తా: యువకుడి మృతి

మరో ముగ్గురికి తీవ్రగాయాలు

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా నలుగురు గాయపడ్డారు. చిన్నశంకరపేట మండలంలో కారు ప్రమాదంలో యువకుడు, పాపన్నపేటలో బైక్– టాటాఏస్ ఢీన్న ఘటనలో వ్యక్తి, జగదేవ్‌పూర్ మండలంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందాడు.



ప్రమాదానికి గురైన కారు (ఇన్‌సెట్‌లో వినయ్ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం టీ.మాందాపూర్ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం.. మెదక్ మండలం మంబోజిపల్లి గ్రామానికి చెందిన కిచ్చన్నగారి వినయ్‌కుమార్‌గౌడ్(24) మెదక్ హౌసింగ్‌బోర్డు కాలనికి చెందిన మరో ముగ్గురు మిత్రులతో కలిసి సోమవారం రాత్రి గవ్వలపల్లిలో ఉన్న స్నేహితుడిని కలిసేందుకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో భూరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి కారు డ్రైవ్ చేస్తుండగా మందాపూర్ శివారులోని బ్రిడ్జి వద్ద మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో గాయపడిన వినయ్, శ్రీకాంత్‌రెడ్డి, మార్క్ సిమ్సన్, రాజులను పోలీస్‌లు ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయం కావడంతో వినయ్‌కుమార్ మృతి చెందాడు. గాయపడిన ముగ్గురిని మెదక్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వినయ్‌కుమార్ తండ్రి భిక్షపతిగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని జంగంరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణమూర్తి వివరాల ప్రకారం గజ్వేల్‌కు చెందిన పెద్దోళ్ల ప్రవీన్(21) స్నేహితులతో కలిసి సోమవారం సాయంత్రం కొండపోచమ్మ జాతరకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జంగంరెడ్డిపల్లి గ్రామ సమీపంలో బైక్ అదుపు తప్పడంతో ప్రవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యాపారి మృతి..



సలీం మియా (ఫైల్)

పాపన్నపేట(మెదక్): పాపన్న మండల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాపారి మృతి చెందాడు. ఎస్ఐ విజయ్ వివరాల ప్రకారం పాపన్నపేటకు చెందిన సలీం మియా(65) మాంసం వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం మేకను కొనేందుకు బైక్‌పై దౌలాపూర్‌కు వెళుతుండగా పాపన్నపేట శివారులో ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సలీం మియా అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించి, కుమారుడు అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: ఇసుక లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రగాయాలైన ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు పై వెళ్తున్న ఓ ఇసుక లారీ ఎదురుగా వస్తున్న కారును, స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్కూటిపై వెళుతున్న గోవర్ధన్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గోవర్ధన్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో కారు ధ్వంసం అయింది. కారు యజమానికి రాకేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.